www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 19 ఏప్రిల్ 2023
5
ఏలూరు



కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : ఎపి రైతు సంఘం

పెదవేగి:కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం విజయరాయి, రాయన్నపాలెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి ధరలేక గుట్టలుగా పోసిన కొబ్బరికాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరా కొబ్బరి తోటకు రూ.60 వేలకుపైగా పెట్టుబడి అవుతోందన్నారు. వ్యాపారులు ఎండు కొబ్బరికి కాయకు రూ.5.50 మాత్రమే ఇవ్వడం వల్ల కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎండు కొబ్బరికాయకు రూ.12 కనీస ధర ఇచ్చి కొబ్బరి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎరువులు, కూలిఖర్చులు పెరిగిపోయాయని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా కొబ్బరికాయలకు కనీస ధరలు పెంచడం లేదన్నారు. కొబ్బరి కాయలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు.

దోసపాడు దళితుల పోరు ఉధృతం

భూముల్లోకి వెళ్లి చేపలు పట్టి నిరసన తెలిపిన పేదలు, నేతలు

లోకాయుక్త తీర్పు ఎందుకు అమలు చేయరని అధికారులకు ప్రశ్నలు

సంపన్నులకు కొమ్ముకాస్తున్న అధికారుల తీరుపై ఆగ్రహం

పేదల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, దెందులూరు

దోసపాడులో పేద దళితుల భూపోరాటం ఉధృతమైంది. ఇప్పటి వరకూ పాదయాత్రలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేస్తూ ముందుకు సాగిన బాధిత దళితులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కదం తొక్కారు. తమ భూముల్లో అక్రమంగా చేపల చెరువులు తవ్వి అందులో భూస్వాములు సాగు చేస్తున్న చేపలను వలలు వేసి పట్టి నిరసన తెలిపారు. తమ భూములు తమకు పంపిణీ చేసే వరకూ పోరాటం ఆగదని పేదలు హెచ్చరించారు. 'పేదల ఐక్యత వర్ధిల్లాలి, మా భూములకు రక్షణ కల్పించాలి. మా భూములను మాకు వెంటనే ఇవ్వాలి' అంటూ బాధిత పేదలంతా చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. దోసపాడు బాధిత పేదలకు అండగా నిలుస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పేదలతోపాటు వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ చెరువుల్లోకి దిగి చేపలు పట్టి నిరసన తెలిపారు. గుండెలోతు నీటిలోకి దిగి పేదల పక్షాన ఆందోళన చేపట్టారు.



బడాబాబులు ఆక్రమించుకున్న భూముల్లో చేపలు పడుతున్న పేదలు, నాయకులు

పేదల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పేదల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని, దోసపాడులోని పేదల భూములను సంపన్నుల చేతుల్లోని స్వాధీనం చేసుకుని పేదలకు అప్పగించాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పేదల భూములకు రక్షణ లేకుండా పోయిందని, పేదల భూములను సంపన్నులు ఆక్రమించుకుని అనుభవిస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 2015లో లోకాయుక్త పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అధికారులు ఎందుకు అమలు చేయడం లేదంటూ నిలదీశారు. దోసపాడులో సుమారు 50 ఏళ్ల క్రితం పేదలకు డి.ఫారం, అసైన్డ్ పట్టాలు పంపిణీ చేశారన్నారు. కొల్లేరు కాంటూరు, కొల్లేరు ఆపరేషన్ పేరుతో పేదలను ఇక్కడి నుంచి తరిమేసి పెత్తందారులు, సంపన్నులు అధికారుల సహకారంతో భూములను అక్రమంగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. ఈ భూములు తమవేనని 2007 నుంచి పేదలు న్యాయమైన పోరాటం చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం భూస్వాములకు కొమ్ముకాస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. భూస్వాములు అప్పీల్‌కు వెళ్లి పేదల భూములను అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చట్టప్రకారం వ్యవహరించడం లేదని, పేదలపై దాడి చేసినా ఎటువంటి కేసులూ నమోదు చేయడం లేదని అన్నారు. తమ భూముల్లోకి వచ్చిన దళితులపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా భూస్వాములపై కేసులు నమోదు చేసి, అన్యాయానికి గురైన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు భూములు పంపిణీ చేయాలని శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా పేదలు చేపల చెరువులు అనుభవించేలా చేపలు పట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ పోరాటంలో ముందుముందు జరిగే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని శ్రీనివాసరావు హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, పెట్టిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లోని నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. చేపల చెరువుల్లో కోడి వ్యర్థాలు వేస్తూ నీటి కాలుష్యానికి కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.మహంకాళిరావు, జె.మహేష్, సిహెచ్.మాధవ, పి.ఆనందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, సిఐటియు నాయకులు జె.గోపి, పలువురు సిపిఎం నాయకులు, దోసపాడు గ్రామ పేదలు, దళితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ఉద్యోగుల ధర్నాలో పాల్గొన్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ఎపి అమరావతి జెఎసి ఆధ్వర్యాన

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులు, పొరుగు సేవలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, గ్రామ వార్డ్ సచివాలయ ఉద్యోగులు పెద్దఎత్తున స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు సిఎం జగన్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. ప్రభుత్వ పథకాలను, నవరత్నాలను క్షేత్రస్థాయిలో అత్యంత పారదర్శకతతో అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'నాడు - నేడు' అమలులోనూ కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. పిఆర్‌సి 2022లో క్యాడర్ ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. దీంతో నూతనంగా చేరిన ప్రభుత్వ ఉద్యోగికి, వారి స్కేల్ నిర్ణయించకుండా, జీతాలను ఏ స్కేల్ క్రింద డ్రా చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితుల్లో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలు 2020 ఏప్రిల్ నుంచి 2021 డిసెంబర్ వరకూ ఇవ్వాల్సిన డిఎరియర్స్ సొమ్మును డ్రా చేయడంతో ట్రెజరీలో ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదని, రిటైర్డ్ ఉద్యోగులకు, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగులకు రావాల్సిన ఫ్యామిలీ బెనిఫిట్ ఫండ్, జిపిఎఫ్ నగదు, ఎపిజిఎల్ఐ అమౌంట్, ఇతర బెనిఫిట్స్ సకాలంలో రావడం లేదన్నారు. అనేక రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేస్తుంటే ఇక్కడమాత్రం చేయడం లేదన్నారు. ఈ ధర్నాలో ఎపి జెఎసి అమరావతి అసోసియేషన్ ఛైర్మన్ ఫణిరాజు, జెఎసి రాష్ట్ర కో-ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడారు. ధర్నాకు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఎపి ఎన్‌జిఒ నాయకులు చోడగిరి శ్రీనివాస్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్ కుమార్, నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహాలక్ష్మి, పెన్షనర్లు, ట్రేడ్ యూనియన్ నాయకులు, వివిధ సంఘాల కార్యదర్శులు, ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జీతాల బిల్లులు, డిడిఒల అధికారాలపై స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని యుటిఎఫ్ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జొన్నకూటి రాజారావు, ఎమ్‌డి.జిక్రియా తెలిపారు. కార్యక్రమంలో జీతాలు, ,ఇతర బిల్లులు ఎలా చేయాలి, డిడిఒకు ఉన్న అధికారాలు, బిల్లులు ఎలా అప్లోడ్ చేయాలి తదితర అంశాలను అందరికీ అర్థమయ్యేలా యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ కెవి.సత్యనారాయణమూర్తి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ముస్తాఫాలీ, జిల్లా కార్యదర్శి ఈడే శివశంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి.అప్పారావు, నగర కోశాధికారి కె.కిరణ్ కుమార్, కార్యదర్శులు ఆర్‌విఆర్‌కె.వరప్రసాద్, టి.మారుతి, మహంకాళిరావు, డి.రామచంద్రరావు, నగరశాఖ హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమ గీతం పాడాలి

టిడిపి నేత బొరగం శ్రీనివాస్

ప్రజాశక్తి - టి.నరసాపురం



'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో నేతలు

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వల్లంపట్ల పంచాయతీలోని సాయంపాలెం గ్రామంలో మంగళవారం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పురవీధుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తి, మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావుగౌడ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మినారాయణ, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, పేరుబోయిన శ్రీనివాసరావు, చవల అప్పలరాజు, పెద్దన సత్యనారాయణ, సాధనాల సూరిబాబు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి టిడ్కో ఇళ్లు పంపిణీ

ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించే కార్యక్రమం చురుగ్గా సాగుతుందని మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని చెప్పారు. మంగళవారం పోణంగిలో గృహనిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్‌తో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఆళ్ల నాని పాత్రికేయులతో మాట్లాడుతూ డిసెంబరు నాటికి టిడ్కో ఇళ్లు అందిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు వేల ఇళ్ల నిర్మాణాలు ప్రతిపాదించి కొంతమంది లబ్ధిదారుల నుంచి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేశారన్నారు. పాదయాత్ర సందర్భంలో సిఎం జగన్ టిడ్కో, ఇందిరమ్మ ఇళ్ల సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొకుని వాటిని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్లు పూర్తిచేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏలూరులో రెండు వేల టిడ్కో ఇళ్లకు సంబంధించిన విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని, డిసెంబరులోగా వాటి పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

అడిగిన వారికి 'ఉపాధి' చూపాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

జాబ్ కార్డు కలిగిన ప్రతికూలీకి ఉపాధి హామీ చట్టంలో పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ కోరారు. మండలంలోని వణుదుర్రులో మంగళవారం ఆయన మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చాక పోరాడి సంపాదించుకున్న ఉపాధి చట్టాన్ని తూట్లు పొడించేందుకు నిరంతరం కుట్ర చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయంలో ఇచ్చిన పనిముట్లు, టెంట్లు, మజ్జిగ, వేసవిలో ఆదనపు వేతనం, ఐదు కిలోమీటర్లు దాటితే ఆటోఛార్జి వంటి అనేకాంశాలు లేకుండాపోయాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులను ఆపహాస్యం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలన్నారు. ప్రతిరోజు పని కల్పిస్తూ రోజుకు రూ.600 వేతనంగా చెల్లించాలన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో కూలీలకు పనులు లేకపోవడంతో ఇళ్ల వద్దే ఉంటున్నారన్నారు. ఫలితంగా కూలీలు అర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలు వలసలు పోకుండా సొంతూరులోనే పనులు కల్పించి ఆదుకోవాలన్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు పని చేసే ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలన్నారు.

బిజెపి హయాంలోనే ప్రజలపై భారాలు

జిల్లాలో కొనసాగిన సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్రలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచారభేరి యాత్ర మంగళవారం మండలంలోని అంకాలగూడెం, బోడిగూడెం, మంగపతిదేవిపేట, దిప్పకాయలపాడు, తంగెళ్లగూడెం, కన్నాపురం, మాదాపురం, బిల్లిమెల్లి, మర్రిగూడెం, కిచ్చప్పగూడెం, వేదాంతపురం, రామానుజపురం, నరసన్నపాలెం, సీతంపేట, బైనగూడెం గ్రామాల మీదుగా సాగింది. మాదాపురం చెరువులో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జి.వెంకట్రావు మాట్లాడుతూ మోడీ అధికారంలోకొచ్చాక ఉపాధి హామీకి నిధులు తగ్గిస్తూ కూలీల పొట్టకొడుతున్నారని విమర్శించారు. సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాల మోత పెరిగిందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమదోపిడీకి సహకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు టి.ఆంజనేయరాజు, సిపిఎం నాయకులు ఆకుల దుర్గారావు, మర్రి త్రిమూర్తులు, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం ప్రచార భేరి యాత్రలో భాగంగా సిపిఎం. సిపిఐ ఆధ్వర్యాన జరిగిన సభల్లో సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు టివిఎస్.రాజు మాట్లాడారు. బిజెపి హయాంలో ప్రజల మనుగడ ప్రశ్నార్థకమైందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అదాని, అంబానీలకు కట్టబెట్టడం కోసం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 20న పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే బహిరంగ సభలో ప్రజలు పాల్గొనాలని కోరారు. యాత్రలో సిపిఎం నేతలు అందుగుల ప్రభాకర్‌రావు, బొడ్డు రాంబాబు, పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు, ఎస్‌కె.సుభాషిణి, ఎస్‌కె.మాబుసుభాని, వంగా గోపి, చల్లారి మాణిక్యాలరావు, సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు, చిట్టూరి వెంకటేశ్వరరావు, తాళ్లూరి నాగరాజు, సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఏలూరు: ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ సంస్థలకు ప్రజా సంపదను దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం అని సిపిఐ జిల్లా కార్యదర్శి



భీమడోలు మండలంలో..

కె.మన్నవకష్ణ చైతన్య, సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ అన్నారు. మంగళవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి నగరంలో కొనసాగింది. బిజెపి అధికారంలోకి వచ్చాక సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం జీవన స్థితిగతులు దుర్భరంగా మారాయని విమర్శించారు. బిజెపిని ఇంటికి సాగనంపితే తప్ప ప్రజల జీవన స్థితిగతులు మారవని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిచ్చుక ఆదిశేషు, బి.జగన్నాధరావు, ఏసుబాబు, పల్లి మాణిక్యాలరావు, సిపిఐ నాయకులు కడుపు కన్నయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

భీమడోలు: సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి యాత్ర మంగళవారం మండలంలో పర్యటించింది. కార్యక్రమంలో భాగంగా ప్రచార భేరి యాత్ర మంగళవారం భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.



జీలుగుమిల్లి మండలంలో..



ఏలూరులో..

రైతులు పండించిన ప్రతి గింజనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, ఈ మేరకు అవసరమైన గోనె సంచులను అందజేయాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారభేరి యాత్ర బృందం కోరింది. మంగళవారం మండలంలో పలుచోట్ల యాత్ర సాగింది. భీమడోలు వద్ద రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులను నాయకులు కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు రైతులకు కొనుగోలు విషయమై భరోసా ఇవ్వాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరిగే సమయంలో మిల్లర్లు దళారుల పాత్ర లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట రుణాలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, సిపిఎం నాయకులు నారపల్లి రమణరావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర మంగళవారం సాయంత్రం ద్వారకాతిరుమల చేరుకుంది. గుడి సెంటర్‌లో జరిగిన ప్రచార భేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ మోడీ అధికారంలోకొచ్చాక ప్రజలపై లక్షల కోట్ల రూపాయల భారాలు మోపి అదాని, అంబానీలకు లక్షల కోట్లు రాయితీలిస్తున్నారని విమర్శించారు. ఎపికి ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారన్నారు. సిపిఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దివాళా తీయిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పుప్పాల కన్నబాబు, సిపిఎం నాయకులు నారపల్లి రమణారావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర మంగళవారం మండలంలో సాగింది. కామయ్యపాలెం, జీలుగుమిల్లి, దర్భగూడెం, ములగలంపల్లి తదితర గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు దారుణంగా పెంచేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి నిధులు కేంద్రమే భరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం బుట్టాయగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, నాయకులు తామా ముత్యాలమ్మ, అప్పారావు, నిర్మల, సీతారామయ్య కొండలరావు, భాస్కర్ పాల్గొన్నారు.

ఉంగుటూరు: అత్యంత సంపన్నుల కోసం దేశాన్ని, దేశ ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్న బిజెపిని గద్దె దించితేనే మన దేశానికి భవిష్యత్తు ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర మంగళవారం కైకరంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా లింగరాజు, సిపిఐ రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు, పుప్పాల కన్నబాబు, నారపల్లి రమణరావు, కొర్ని అప్పారావు, గుత్తికొండ కృష్ణారావు, సీరా అప్పారావు పాల్గొన్నారు.

సెల్ఫీ పిచ్చితో చంద్రబాబు ట్వీట్‌లు : మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సెల్ఫీ పిచ్చితో చంద్రబాబు పిల్లచేష్టలు చేస్తూ ట్వీట్‌లు చేస్తున్నారని, దమ్ము, ధైర్యం ఉంటే చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో నిర్మితమవుతున్న ఇళ్ల నిర్మాణాల వద్దకు రాగలరా అంటూ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం జిల్లాలో మంత్రి పర్యటించారు. గృహ నిర్మాణంపై అధికారులతో సమీక్షించి పోణంగి లే అవుట్‌లో నిర్మితమవుతున్న గృహాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లా డుతూ ఎంఎల్‌ఎలంతా గృహనిర్మాణ సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అన్ని సమస్యలను పరిష్కరించి పురోగతికి అధికారులకు అదేశాలిచ్చామన్నారు. చంద్రబాబు శిఖండిలా ఇళ్లనిర్మాణాలకు అడ్డుపడుతున్నారన్నారు. రాష్ట్రంలో 17 వేల కాలనీల్లో ఇళ్లనిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. 'జగన్ మూడేళ్లలో చేసిందేంటో చూపిస్తాం.. మీరు చేసిందేంటో చూపించగలరా' అని చంద్రబాబును ప్రశ్నించారు. రాష్ట్రమంతా కాకపోయినా కుప్పంలోకి వచ్చి తమ అభివృద్ధి, సంక్షేమం ఏమిటో చూపిస్తామన్నారు. హరీష్‌రావు వస్తే ఎపిలో అభివృద్ధి ఏం జరిగిందో చూపిస్తామన్నారు. పవన్‌కల్యాణ్ హైదరాబాద్ వాసి అని, విజిటింగ్ వీసా మీద మాత్రమే ఇక్కడకు వస్తున్నారంటూ విమర్శించారు. పవన్, చంద్ర బాబు ఎంతమంది కలిసి వచ్చినా వైసిపి విజయాన్ని ఆపలేరన్నారు.

వేధిస్తున్న గోనె సంచుల కొరత..!

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఖరీఫ్ ధాన్యం సేకరణకు గోనె సంచుల కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉంగుటూరు మండలంలో 22,309 ఎకరాల్లో వరి పండించారు. వాటిలో సోమవారం నాటికి 5582 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో ఉంది. ఈ ధాన్యం అంతా నింపాలాంటే దాదాపు 5,75,000 సంచులు అవసరమవుతాయి. నారాయణపురం సొసైటీ నుంచి ఏడు ఆర్‌బికెలకు 72 వేల సంచులు మంగళవారం నాటికి పంపిణీ చేశారు. ఇంకా 18 ఆర్‌బికెల్లో సంచులు సరిపడా రావాల్సి ఉందని, సకాలంలో సంచులు లేక ధాన్యం రాసులు కల్లాలు, రోడ్లపై దాచుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాగా ఎకరాకు వందకు పైగా సంచులు సరఫరా చేయాలని రైతులు స్పందనలో అధికారులను కోరారు. కానీ ఆన్‌లైన్‌లో ఎకరాకు 75 సంచుల లిమిట్ మాత్రమే చూపిస్తోందని ఆర్‌బికె సిబ్బంది పేర్కొన్నారు. నారాయణపురం, ఉంగుటూరు ఆర్‌బికెల నుంచి రెండు లారీల్లో 1200 బస్తాలను మిల్లులకు తోలారు. దీంతో ఉంగుటూరు మండలంలో ధాన్యం సేకరణ ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే జగన్ లక్ష్యం

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో 30 లక్షల మంది గూడులేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందించడమే కాకుండా ప్రణాళికబద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ చెప్పారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం పోణంగి జగనన్న ఇళ్ల లేఅవుట్‌ను సందర్శించి ఇళ్ల నిర్మాణ పనులను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేలకుపైగా జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే ఇళ్ల స్థలాలిచ్చి అక్కడే గహనిర్మాణాలు ప్రారంభించామన్నారు. పోణంగిలో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ లేఅవుట్‌లో 7035 ఫ్లాట్‌లకు గాను 5687 ఇళ్లను ఇప్పటికే మంజూరు చేయగా పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.లేఅవుట్‌లో విద్యుత్ సౌకర్యం పనులు దాదాపు పూర్తికాగా తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తామన్నారు. సుమారు 20 వేల మంది జనాభా నివాసం ఉండే వీలు కలుగుతుందన్నారు. ఆ లేఅవుట్ ఆనుకుని మరో ఆరు వేల మందికి ఇళ్లస్థలాలతో మరో లేఅవుట్‌ను విస్తరించడం జరుగుతుందన్నారు. దేశంలో కేంద్రం 1.25 కోట్లు ఇళ్లు మంజూరు చేయగా ఒక్క మన రాష్ట్రంలోనే సుమారు 22 లక్షల ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుతుందని వివరించారు. ఏలూరు జిల్లాలో 87,444 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికే 21 వేల 432 ఇళ్లు పూర్తి చేశారన్నారు.

అలాగే పోణంగిలోని జగనన్న ప్రధాన అర్బన్ లేఅవుట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ టాన్స్ ఫార్మర్‌ను రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ ఎంఎల్‌ఎ ఆళ్ల నానితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల్లో రూ.10 కోట్ల వ్యయంతో విద్యుత్ సౌకర్యం కల్పించామని తెలిపారు. 128.06 ఎకరాల్లో 7,035 ఫ్లాట్లు కలిగిన లే అవుట్‌లో ప్రస్తుతం 5,687 ఇళ్లను మంజూరు చేశామని, ఇప్పటి వరకూ ఈ లేఅవుట్‌లో వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు రూ.9.99 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. అదే విధంగా రూ.10 కోట్లతో విద్యుత్ సౌకర్యం చేపట్టామన్నారు. 1257 విద్యుత్ స్తంభాలను, 3.35 కిలోమీటర్ల మేర 11కెవి విద్యుత్ లైన్లు ఇళ్లకు ఎల్‌టి లైన్లు, 100కెవి ఎనిమిది ట్రాన్స్ ఫార్మర్లు, 160కెవి 12 ట్రాన్స్ ఫార్మర్లు, 400 వీధిలైట్లు వేశామని తెలిపారు. జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రూ.282 లక్షలతో తాత్కాలిక నీటి సౌకర్యం కల్పించామని, ఆరు బోరుబావుల నిర్మించామని తెలిపారు. అనంతరం కాలనీల్లో మొక్కలు నాటారు.

భీమడోలు:జగనన్న కాలనీల తరహాలో గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పాత లే అవుట్‌లలో అన్ని కనీస సౌకర్యాలు కల్పించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం భీమడోలులోని దిగుడు పాటి దిబ్బ ఆవాస ప్రాంతంలోని జగనన్న కాలనీని ఆయన సందర్శించారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు.. విద్యుత్ సమస్య పరిష్కారంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రత్యేకించిన వంద కెవి.సామర్థ్యం గల మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పడకేసిన రోడ్డు విస్తరణ పనులు

నాలుగేళ్ల క్రితం నూజివీడు - ఏలూరు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

నేటికీ ఓ కొలిక్కిరాని దుస్థితి

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. కొరవడిన ఆర్అండ్‌బి అధికారుల పర్యవేక్షణ

ప్రయాణికులకు తప్పని అవస్థలు



నూజివీడు-ఏలూరు రహదారి

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు - ఏలూరు ఆర్అండ్‌బి రోడ్డు విస్తరణ పనులు నాలుగేళ్లుగా నత్తనడక సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. నూజివీడు బైపాస్ నుండి పోతిరెడ్డిపల్లి, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల, సింగవరం అడ్డరోడ్డు వరకూ 23 కిలోమీటర్లు సింగల్ రోడ్డుగా ఉన్న 12 అడుగుల రహదారిని 23 అడుగులకు పెంచి రెండు లైన్ల రహదారిగా విస్తరణ చేపట్టే పనులు 2019లో ప్రారంభమయ్యాయి. ఎమ్‌డిపి నిధులు రూ.47 కోట్ల 20 లక్షల అంచనాతో హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ అండ్ పృధ్వి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులు చేయడానికి ముందుకు వచ్చింది. కంపెనీకి నూజివీడు నియోజకవర్గ అధికార పార్టీకి చెందిన నాయకుడు సబ్ కాంట్రాక్టర్ ఉన్నారు. పనులు ప్రారంభంలో శరవేగంగా చేపట్టినప్పటికీ ఆ తర్వాత బిల్లుల చెల్లింపు సక్రమంగా లేకపోవడంతో మూడేళ్ల నుండి పనులను పూర్తిగా నిలిపేశారు. అన్నపనేని వారి గూడెం అడ్డరోడ్డు నుండి ముసునూరు అడ్డ రోడ్డు వరకూ రోడ్డు విస్తరణ పేరట ప్రస్తుతం ఉన్న రోడ్డుకి ఇరువైపులా అటు ఐదున్నర అడుగులు మేర రోడ్డును విస్తరించి మెటల్ కూడా పరిచారు. మెటల్ పరిచిన అనంతరం లేయర్ వెయ్యకుండా అసంపూర్తిగా పనులను ఆపేసి మూడేళ్లు కావస్తోంది. నేటికీ ఆ పనులు తిరిగి ప్రారంభం కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మహాశివరాత్రి బలివే తిరునాళ్లకు లక్షలాది మంది యాత్రికులు తరలివచ్చారు. నూజివీడు నుండి ఈ అసంపూర్తి రోడ్డు గుండానే బలివే వెళ్లే క్రమంలో వాహనదారులు అసంపూర్తిగా ఉన్న కంకర రోడ్డుపై ప్రయాణించే క్రమంలో అనేక అవస్థలు పడ్డారు. విస్తరణ ప్యాకేజీలో పనులు జరగడంతో మరమ్మతు పనులను సైతం చేపట్టడానికి అవకాశం లేని దుస్థిలో నూజివీడు నుండి ముసునూరు, గోపవరం గుండా ఏలూరు వెళ్లే వాహనదారులు నాలుగేళ్లుగా నరకయాతన పడుతున్నారు.

నత్త నడకన జరిగే పనులకు పచ్చని భారీ వృక్షాలు నరికివేత

వేల్పుచర్ల, సింగవరం అడ్డరోడ్డు నుండి విస్తరణ పనులు చేపట్టి అసంపూర్తిగా ఆలా నాలుగేళ్లుగా వదిలేసిన సబ్ కాంట్రాక్టర్, సబ్‌కలెక్టర్ విస్తరణ పనులంటూ నెల రోజులుగా తిరిగి హడావుడి చేస్తూ నేలపాటివారికుంట నుండి ముసునూరు శిల్క్ నగర్ అడ్డరోడ్డు వరకూ రోడ్డుకు ఇరువైపులా విస్తరించి ఉన్న పచ్చని భారీ వృక్షాలను నరుకుతున్నారు. పచ్చని మైదానంగా పేరుబడిన నేలపాటివారికుంట - ముసునూరు రోడ్డు నాలుగేళ్లుగా నత్తనడకన నడుస్తున్న రోడ్డు విస్తరణ దెబ్బతో ప్రస్తుతం భారీ వృక్షాలన్నీ కనుమరుగయ్యాయి. పచ్చని రోడ్డు అంతా మోడుబారి దర్శనమిస్తుంది. నాగేంద్రపురం, సింహాద్రిపురం, వేల్పుచర్ల గ్రామాల పరిధిలో సర్వే చేపట్టి రెండు వరసల రహదారి నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించాల్సిన పరిస్తులు నెలకొన్నాయి. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ పలుమార్లు ఈ రోడ్డును సందర్శించి భూ సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో నూజివీడు - ఏలూరు రోడ్డు విస్తరణ పనులు గుర్తుకు వచ్చి హడావుడి చేస్తున్నారని, అయితే ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో, ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

త్వరలో పనులు ప్రారంభం

నూజివీడు - ఏలూరు రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే తిరిగి ప్రారంభమవుతాయని నూజివీడు ఆర్అండ్‌బి డిఇఇ సిహెచ్.బాబూరావు తెలిపారు. రిత్విక్ అండ్ పృధ్వి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ 13 రోడ్లు కలిపి ఒక ప్యాకేజీగా పనులను చేపడుతోందని ఆయన తెలిపారు. పలుచోట్ల పనులు చేపడుతున్న కారణంగా ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంలో కొంతజాప్యం జరుగుతోందని ఆయన తెలిపారు.

ఏలూరులో పలుచోట్ల చలివేంద్రాలు : మేయర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రస్తుతం నెలకొన్న అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నుండి ప్రజల దాహార్తిని తీర్చేందుకు నగర కార్పొరేషన్ పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏలూరు కార్పొరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. మంగళవారం ఉదయం ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం స్థానిక శాసనసభ్యులు ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాల కూడల వద్ద చలివేంద్రాలను ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ వేడి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అందరూ పాటించాలన్నారు. నగరంలో విరివిగా చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తులు అసోసియేషన్ వారు ప్రజల దాహార్తినితీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఎంఆర్ పెదబాబు, మున్సిపల్ కార్పొరేషన్ డిఇ కొండలరావు, ట్విట్టర్ హరినాథ్ బాబు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి



సాయం చేస్తున్న దాత

అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి మంగళవారం వైద్య విద్యార్థిని, అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి అర్థిక సాయం చేశారు. మండలంలోని పెదగొన్నూరు పంచాయతీ శివారు విశ్వనాద్రిపాలేనికి చెందిన చిల్లిముంత నాగమల్లేశ్వరరావు గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఈ విషయం తెలిసిన వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.ఐదు వేలు నగదు, నిత్యావసర సరుకులు అందించారు. ఏ అవసరం వచ్చినా భవిష్యత్‌లో మృతుని కుటుంబానికి సహాయ సహకారం అందిస్తామని మనోజ్ తెలిపారు.

పెదపాలపర్రులో కరోనా నివారణ చర్యలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజారోగ్య భద్రత దృష్ట్యా, కరోనా నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని పెదపాలపర్రులో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలతో పాటు కరోనా నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి బజారులో శానిటేషన్ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచి రాకేష్ మాట్లాడుతూ గ్రామస్తులు ప్రతిఒక్కరూ మస్కు ధరించి, చేతులు, శరీర శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచి గంటా రాకేష్, పంచాయతీ కార్యదర్శి షహనాజ్, ఉపసర్పంచి గన్నమనేని వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

అగ్ని ప్రమాదాల నియంత్రణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు కోరారు.. ఆయన ఆధ్వర్యంలో భీమడోలు అగ్నిమాపక కేంద్రం నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు మంగళవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఫ్యాక్టరీలలో తరచూ చోటు చేసుకునే అగ్ని ప్రమాదాలు, వాటిఅదుపు, ముందస్తు రక్షణ చర్యల పట్ల అగ్నిమాపక సిబ్బంది కార్మికులకు వివరించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు చేపట్టాల్సిన చర్యలను డెమో రూపంలో వివరించారు.

ఉత్కంఠగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఉంగుటూరు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఉంగుటూరులో శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ నాలుగో రోజు మంగళవారం నాలుగు మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి. మొదటి మ్యాచ్ గణపవరం సీనియర్స్, భావాయిపాలెం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన గణపవరం జట్టు 102 పరుగులు చేసింది. బావాయిపాలెం జట్టు 34 పరుగులకు ఆల్‌అవుట్ అయింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ చందు దక్కించుకున్నాడు. కొత్తగూడెం కెజిఎం, అడవికొలను జట్ల మధ్య జరిగిన మూడో మ్యాచ్‌లో అడవికొలను జట్టు విజయం సాధించింది. భీమడోలు సీనియర్స్- పెదనింద్రకొలను జట్ల మధ్య జరిగిన నాలుగో మ్యాచ్‌లో భీమడోలు జట్టు విజయం సాధించింది.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నాగేశ్వరరావు

విశ్వబ్రాహ్మణ సంఘ సేవలు అభినందనీయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కైకలూరు

ప్రతిఏటా వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మార్కెట్ వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, సర్పంచి దానం మేరి నవరత్న కుమారి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు జంపన నరసింహరాజు, మూలలంక సర్పంచి విజయబాబు, తుపాకుల సోమాచారి, లక్కోజు సురేష్, తోట మహేష్, పి.వీరభద్రచారి, టివి.సత్యనారాయణ, కర్రి మోజేష్, నాగేశ్వరరావు, యనాలా బసవయ్య పాల్గొన్నారు.

వివాదాస్పద ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - ముసునూరు

కల్లెకర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు ఎస్ఐ ఎం.కుటంబరావు తెలిపారు. మంగళవారం మండలంలోని 16 గ్రామాల్లోని ఫ్లెక్సీలు, బ్యానర్లను పోలీసులు తొలగిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫ్లెక్సీల వల్ల వివాదాలు తలెత్తుతున్నాయని, భవిష్యత్తులోనూ ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముందనే ఉద్దేశంతో వీటిని తొలగిస్తున్నట్లు తెలిపారు.

పలుచోట్ల జగనన్నే మా భవిష్యత్తు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో కొత్త పట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సర్పంచి మైగాపుల విజయదుర్గ, ఎంపిటిసి ఉలవల వరలక్ష్మి, వైసిపి సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, ఉలవల బాలాజీ, నాయకులు కన్వీనర్లు, గృహ సారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

ప్రారంభించిన ఎంఎల్ఎ తలారి వెంకట్రావు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ తలారి

మండల కేంద్రం ద్వారకాతిరుమలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మంగళవారం ప్రారంభించారు. ముందుగా శివాలయం రోడ్డులో రూ.5 లక్షలతో వేసిన తాగునీటి బోరును ప్రారంభించారు. మార్కెట్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. రూ.0.90 లక్షలతో రిపేరు చేసిన సురక్షిత తాగునీటి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, ఎంపిటిసిలు రుద్రసూర్యకళ వెంకట శివాజీ, పెద్దిరెడ్డి రమ్య కుసుమ నాగేశ్వరావు, చెలికాని రాజబాబు, మండల నాయకులు బొండాడ వెంకన్న బాబు, వాసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ద్వారకాతిరుల వైసిపి టౌన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి వెంకటరావు, సర్పంచి కుంటం స్వర్ణలత సతీష్, ప్రసాద్, చెన్నూరి రామకృష్ణ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చాట్రాయి

అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి లంక నిర్మల అన్నారు. మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ఎంపిపి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్యాధికారి లీనా బెంజిమెన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు అలసటకు గురవుతారని, వడదెబ్బకు గురికాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు పిహెచ్‌సిలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరూ ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారి డి.శివశంకర్ మాట్లాడుతూ మండలంలో ఎనిమిది వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరతున్నారని, దీనిపై జెసి లావణ్యవేణికి అనుమతి కోసం సమాచారం పంపామన్నారు. రైతు భరోసా కోసం 64 మంది రైతులు కొత్తగా నమోదు చేసుకున్నారని, కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చినవారు ఆర్‌బికెలో నమోదు చేసుకోవాలన్నారు. ఎంఇఒ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కళాశాల మంజూరైందని, ఈ సంవత్సరం బాలికలను కళాశాలలో చేర్చేవిధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు.

జెడ్‌పిటిసి సభ్యులు చెలికాని అనూష మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం చేపడుతున్న పథకాల వివరాలను తెలియజేయడం లేదని అధికారులపై మండిపడ్డారు. ఎపి కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి మాట్లాడుతూ ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి సభ్యులు పదవి చేపట్టి 19 నెలలయిందని గ్రామాల అభివృద్ధి కోసం రూ.40 లక్షల నిధులు వచ్చాయని, వాటిని గ్రామాల వారీగా ఒక్కొక్క గ్రామానికి రూ.రెండు లక్షలు అభివృద్ధికి కేటాయించామన్నారు.

మద్ది ఒక్క రోజు ఆదాయం రూ.1,06,946

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి ఒక్కరోజు రూ.1,06,946 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం అధిక సంఖ్యలో యాత్రికులు ఆలయానికి తరలి వచ్చారు. ఈ క్రమంలో వివిధ సేవల రూపేణ రూ.1,06,946 సమకూరినట్లు చెప్పారు. సుమారు 800 మందికి అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బాబి, మానికల బ్రహ్మానందరావు, బల్లే నాగలక్ష్మి, పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ఆలయ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశామని ఆలయ కార్య నిర్వహణాధికారి తెలిపారు. వేసవి రిత్యా ఆలయానికి తరలివచ్చే యాత్రికులకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించడానికి నిత్యం మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా శ్రీసాయి గీతాంజలి వార్షికోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు శ్రీసాయి గీతాంజలి ఇంగ్లీషు మీడియం స్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ వేల్పుల శివకోటియాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాటలు, డ్యాన్సులతో అలరించారు. విద్యార్థుల నాటకాలతో మెప్పించారు. అనంతరం చదువులో ప్రతిభ కనబర్చిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, గృహసారధులు బాధ్యతగా పనిచేయాలని జెడ్‌పిటిసి సభ్యులు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ సూచించారు. ముసునూరులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 16 గ్రామాల పార్టీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వాలంటీర్లు, గృహసారధులు పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా పనిచేస్తే రాష్ట్ర సచివాలయానికి ఫిర్యాదు చేయాల్సి వస్తుందన్నారు.

నేరాలు - ఘోరాలు

కొమ్మూరులో దారుణం

మద్యం తాగి ఇబ్బంది పెడుతున్నాడని స్తంభానికి కట్టేసి కొట్టిన బంధువులు

దెబ్బలకు ప్రాణాలొదిలిన వైనం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



మృతిచెందిన గాంధీ

మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్న తండ్రిని కొడుకు, బావమరిది కలిసి స్తంభానికి కట్టి కొట్టడంతో మృతిచెందిన సంఘటన మండలంలోని కొమ్మూరులో మంగళవారం జరిగింది. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం కొమ్మూరు గ్రామానికి చెందిన ఆరేపల్లి గాంధీ(48) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మూడేళ్లుగా గాంధీ ఏ పని చేయకుండా, ఇంటివద్దనే ఉంటూ, మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నెల 17వ తేదీన మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్య రాజేశ్వరితో గొడవపడుతుండగా రెండో కుమారుడు అనిల్‌కుమార్ వారించాడు. అదేరోజు సాయంత్రం సెల్‌ఫోన్, కోడి పుంజులను అమ్మి ఆ డబ్బుతో మద్యం సేవించి, భార్యతో గొడవపడ్డాడు. దీంతో భయపడిన రాజేశ్వరీ మల్లవల్లి తన తమ్ముడి ఇంటికి వెళ్లింది. అదే రోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆరేపల్లి గాంధీ, తన రెండో కుమారుడు అనిల్‌కుమార్, బావమరిది వేముల శ్రీనివాసరావుతో గొడవపడ్డాడు. దీంతో గాంధీని ఇంటికి ఎదురుగా ఉన్న స్తంభానికి కట్టి విచక్షణారహితంగా కర్రతో కొట్టారు. రాత్రి అంతా స్తంభానికి ఉంచడంతో మంగళవారం ఉదయానికి గాంధీ ప్రాణాలు కోల్పోయాడు. మృతుని భార్య రాజేశ్వరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు దర్యాప్తు చేస్తున్నారు.




మృతిచెందిన విద్యార్థులు

గోదావరిలో ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

వల్లూరులో విషాదఛాయలు

ఆచంట: వేసవి తాపాన్ని తట్టుకోలేక గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ నీట మునిగిన ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వల్లూరుకు చెందిన ఐదుగురు విద్యార్థులు భీమలాపురం వద్ద వశిష్ట గోదావరిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో వీరిలో కామిశెట్టి గిరిధర్ (15) ప్రవాహనికి కొట్టుకుపోతుండగా పక్కనే ఉన్న కొండేపూడి భానుప్రసాద్ (15) రక్షించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో వీరిద్దరూ నీట మునిగి గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ఒడ్డుకు చేరుకుని గ్రామస్తులకు సమచారం అందించారు. దీంతో గ్రామస్తులు, అధికారులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా కొద్దిసేపటికే గిరిధర్, భాను ప్రసాద్ మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో వల్లూరులో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ఇద్దరు విద్యార్థులు వల్లూరు హైస్కూల్‌లో చదివి ఇటీవల ముగిసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. మృతుల్లో ఒకరైన కామిశెట్టి గిరిధర్ తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం ఇటీవలే ఇతర దేశాలకు వెళ్లారు. మరో విద్యార్థి కొండేపూడి భానుప్రసాద్ తండ్రి విక్టర్‌బాబు కూడా ఉపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లారు. రెండు కుటుంబాల్లో ఏకైక కుమారులు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మాట్లాడుతున్న రైతులు

బొమ్మిడి సొసైటీలో అవినీతి..!

అప్పులు కట్టినా బకాయిలున్నాయంటూ నోటీసులు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని బొమ్మిడి విశాల సహకార పరపతి సంఘంలో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించినా ఇంకా బకాయిలున్నాయని నోటీసులు పంపడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సొసైటీ పరిధిలో బొమ్మిడి, ఉప్పాకపాడు, కాకర్లమూడి, విఎపురం, కస్పాపెంటపాడు రుణాల పంపిణీ, వసూలులో సొసైటీ ఉద్యోగులు అవినీతికి పాల్పడ్డారంటూ మంగళవారం పలువురు రైతులు ఆందోళనకు దిగారు. బొమ్మిడి గ్రామానికి చెందిన రైతు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు మద్దాల త్రిమూర్తులు మాట్లాడుతూ తన అమ్మ, మేనల్లుడు పేరున తీసుకున్న పంట, పంటేతర రుణాలకు సంబంధించి సగం చెల్లించినప్పటికీ అప్పుకు నకిలీ రశీదు ఇచ్చి లెడ్జర్‌లో తప్పుగా నమోదు చేసి అవినీతికి సొసైటీ ఉద్యోగులు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై గతంలో సహకార అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి విచారణ చేపట్టారు. ఆ సమయంలో సొసైటీ సిబ్బంది అవినీతి జరిగిందని ఒప్పుకున్నారన్నారు. నోటీసులు అందుకున్న మిగతా రైతులు కూడా సొసైటీ కార్యదర్శిని సంప్రదించగా తీసుకున్న అప్పు కంటే ఎక్కువగా బాకీ ఉన్నట్లు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి మోసపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.